

# మొరెల్లా

అనువాదకథ

**ఆంగ్ల మూలం: ఎడ్గార్ అలెన్ పో**

**అనువాదం: నరేష్ నున్నా**

> **"తాను, తనంతట తాను మాత్రమే**
> **మనిషి అనశ్వరుడు, ఒంటరి"**
>
> **- ప్లేటో: సింపోజియమ్**

**నా స్నేహితురాలు మొరెల్ల అంటే, అపార్థాలకు, ఇతరేతర అన్యర్థాలకు తావులేని గాఢమైన ఆపేక్ష నాకు. ఎన్నో ఏళ్ళ క్రితం తలవని తలంపుగా ఆమె ఆవరణలోకి ప్రవేశించి తనని తొలిసారి చూసినప్పుడు అంతకు ముందెన్నడూ అనుభవం కాని యాతనలో ఆత్మ వెలిగింది. అయితే అదేమీ కాముని రగడ కాదు. నన్ను అతలాకుతలం చేసిన ఆ తీపియాతనల అసాధారణతని ఎంతమాత్రం నిర్వచించలేనని, అనిర్దిష్టమైన దాని తీవ్రతకి పగ్గాలు వేయలేనని క్రమేణ నన్ను నేను సముదాయించుకున్నాను.**

విచిత్రంగా ఏ చందనచర్చల ఉబలాటం లేకుండానే, 'ప్రేమ' అన్న భావం గురించి యోచించకుండానే మేము కలిశాము, విధి మమ్మల్ని కల్యాణ మంటపానికి నడిపించింది. నా ఇంటిని స్వర్గధామం చేయడానికి ఆమె తన లోగిలిని, తన వాళ్ళని వదిలి నాతో వచ్చేసింది. అదో సంభ్రమాశ్చర్యం... అదొక 'కల' కలం!

మొరెల్ల పాండిత్యం చాలా లోతైనది. వేటిని సాధించాలని నేను తపించానో, అటువంటి అనన్య ప్రతిభా విశేషాలు ఆమె సొత్తు. ఆమె ఆలోచనల బలం ప్రచండం. నేనది అర్థం చేసుకోవడం వల్ల ఎన్నో విషయాల్లో ఆమె శిష్యుడ్ని, భక్తుడ్ని అయిపోయాను. బహుశా ప్రెస్బర్గ్‌లో సాగిన ఆమె చదువుల స్థాయి వల్ల కాబోలు మార్మికమైన రచనలెన్నో చేస్తుండేది. నా మటుకు నాకు అవి ప్రాచీన జర్మన్ సాహిత్యంలోని పనికిమాలిన అధ్యాయాల్లా తోచేవి. కారణం నాకయితే తెలియదు గాని, ఆ ప్రాచీన సాహిత్యాలే ఆమెకి ప్రియ నిత్యపారాయణాలు. అయితే ముందు ముందు అవి నాకు కూడా ఇష్టమైనవి కావడం వెనక ఏకైక, పరిణామశీలమైన ప్రభావం నా సహచరిదే.

నా యీ మొత్తం మార్పులో, నిస్సందేహంగా, నా వివేకం పాత్ర ఏమంత లేదు. అలాగే, ఆదర్శంగాని, నేనెంతో అధ్యయనం చేసినప్పటికీ నా చేతలకి, ఆలోచనలకి( నేనేమీ ఘోరంగా పొరబడకపోతే) ఇంకా అంటువలసే ఉన్న మార్మిక లేపనం గానీ నా విశ్వాసాల (పోనీ 'నా' అన్న స్పృహ విస్మరిస్తా) కవళికల్ని గొప్పగా మార్చింది ఏమీ లేదు. ఈ స్పష్టమైన ఎరుకతో నా భార్య మార్గదర్శకత్వంలోకి నన్ను నేను పారేసుకున్నాను, అనైచ్ఛికంగా. అంతేకాకుండా ఆమె అధ్యయనాల అనుపానాల్లోకి నిశ్చల హృదయంతో ప్రవేశించాను. అప్పుడే సరిగ్గా ఆ నిషిద్ధ పుటల్లోకి ఒలికిపోయినప్పుడే, ప్రతిషిద్ధ ఆత్మ ఏదో నాలో ప్రజ్వలించిన భావన పొందినప్పుడే మొరెల్ల తన చల్లని దయాహస్తాన్ని నా తలపై ఉంచి, వేటి విపరీతార్థాలు నా స్మృతి నెగళ్ళలో శలభాలై కాలిపోతాయో అటువంటి ఏవో కొన్ని అల్పమైన ఏకాకి పదాల్ని ఒక మృత తాత్విక బూడిద కుప్పల్లోంచి రేపుతుంది. దాంతో గంటలు గడిచేకొద్దీ ఆమె చుట్టూ పరిభ్రమిస్తూ, ఆమె స్వరమాధుర్యం భయానకమయ్యి కలుషితమయ్యేంత వరకూ ఆ గొంతుకలోని జంత్ర సంగీతంలో ఓలలాడేవాడిని. హఠాత్తుగా సంభవించిన మౌఖిక భయోత్పాతం వల్ల నా ఆత్మ మీద ఒక నీడ కదలాడి, నేను నిలువెల్లా పాలిపోయి, ఈ మట్టినేలలకు ఎంతమాత్రం చెందని ఆ పరాయి స్వరతీవ్రత మాటున నక్కుతాను. అప్పుడు ఆహ్లాదం ఒక్కమాటున భీతావహమైపోతుంది. అమిత సౌందర్యం అతి వికారమవుతుంది, నాకం... నరకమయినట్టు-

సుదీర్ఘంగా, తెంపు లేకుండా, పుంఖానుపుంఖంగా సాగే మా ఇద్దరి సంభాషణల సంవాదాల స్వభావమేమిటో ఇదమిత్థంగా తేల్చాలని చూడటం అనవసరం. ఆ సంవాదాల సారాన్ని సైద్ధాంతిక నైతికత పేరిట గ్రహిస్తారు పండితులు, పామరులైతే ఆ అన్ని ఘటనల్లోంచి కూడా అర్థం చేసుకునేది అతి స్వల్పం. దేవుడి సర్వజ్ఞతని ప్రతిపాదించిన ఫెచ్చి తీవ్ర పాన్‌తీయిజం, పైథాగరస్ అనుయాయుల సవరణ సిద్ధాంతాలు, అన్నింటినీ మించి షెల్లింగ్ ముందుకు తెచ్చిన

అస్తిత్వ భావనలు వంటివే గొప్ప ఊహాశాలి మొరెల్ల చర్చోపచర్చలకి అదనపు ఆకర్షణలు చేకూర్చే అంశాలు. వ్యక్తిగతంగా పేర్కొనే ఆ అస్తిత్వాన్ని, బహుశా లాక్ అనుకుంటూ, హేతుబద్ధ మానవుడి తెలివిడిలోనే ఉంటుందని సత్యనిర్వచనం చేశాడు. కాబట్టే వివేకం ఉన్న బుద్ధిసారాన్నే మనం వ్యక్తిగా అర్థం చేసుకుంటాం. ఎల్లప్పుడూ యోచనతో జతగూడిన చేతన ఉంటుంది కనుకనే, ఆ చేతనే మనల్ని మనం గుర్తించుకునేలా, ఇతర బుద్ధిజీవుల నుంచి మనల్ని వేరుపరిచేలా చేసి మనకొక వ్యక్తిగత అస్తిత్వాన్ని ఆపాదిస్తుంది. మృత్యువుతో గానీ, మరే విధంగానూ ఎన్నటికీ అంతంకాని ఉనికి అనే మూల అస్తిత్వభావం నాకు ఎల్లవేళలా అపరిమిత ఆసక్తి రగిలించే అంశమేగానీ, అంతుబట్టని, ఉద్వేగభరితమైన దాని విపరిణామాలకంటే, ఎంతో ప్రత్యేక శైలిలో కదిలిపోయి మొరెల్ల వాటిని ప్రస్తావించే తీరుని మించి కుతూహలం కలిగించేదేం కాదు.

కానీ, నా అర్థాంగి వ్యవహారశైలి మాటున నిగూఢంగా ఉండే అంతుబట్టనితనం మంత్రమై నన్ను పీడించి, అణగదొక్కుతున్నప్పుడు దుర్ముహూర్తాలేవో ముంచుకొచ్చాయి. నిస్సారమవుతున్న ఆమె మునివేళ్ళ స్పర్శ, క్షీణించి పీలగా మారిన ఆమె మాధుర్య వచనం, తన విషాద నేత్రాల్లో కొడిగడుతున్న దీపకాంతి... భరించే స్థైర్యం కోల్పోయాను. నా దౌర్బల్యం అంతా తెలిసి కూడా తను నన్ను నిందించలేదు, నా బలహీనతలు, మూర్ఖత్వాల పట్ల ఆమె స్నృహలోనే ఉన్నట్టు తోస్తుంది. అందుకే చెదరని చిర్నవ్వుతో చెబుతుంది, అంతా విధి లిఖితమని. తనతో నాకు క్రమేణ దూరం ఏర్పడటానికి కారణం, నాకు బోధపడలేదు గానీ, ఆమెకి స్పష్టమయిందనే అనిపించింది. అయితే దాన్ని, లేదా దాని స్వభావాన్నిగానీ లీలామాత్రంగా కూడా నాకు తెలియపరిచే ప్రయత్నం చేయలేదు. కానీ, ఎంత బింకంగా ఉన్నా ఆమె ఒక స్త్రీ, అందుకే బెంగతో, దిగులుతో నానాటికీ శుష్కించిపోయింది. రోజులు గడిచేకొద్దీ కెంపురంగు మచ్చ ఆమె బుగ్గ మీద ప్రస్ఫుటమయ్యి, పాలిపోయిన నుదుటి మీద నీలి నరాలు స్పష్టంగా కనిపించసాగాయి. ఈ విపరిణామాలతో ఒక్క పెట్టున నాలో జాలి తన్నుకొచ్చేది, మరి అంతలోనే నిగూఢార్థాల ఆమె చూపులతో భేటి అయినప్పుడు నా ఆత్మ రుజాగ్రస్తమై, భీకరమైన అనంత అగాథపు లోతుల్లోకి చూస్తున్నప్పుడు కలిగే గగుర్పాటుతో విహ్వాలుడ్నవుతాను.



ఆ చిత్రహింసల నరకం నుంచి మొరెల్ల విడుదలయ్యే అంతిమ ఘడియలు తోసుకువస్తే బాగుండన్న బలీయమైన కోర్కె ఆ బాధా సందర్భాలలో తొలిచేసేదా? అవును!, కానీ, నా మనసు మీద క్షుభిత నరాలు పెత్తనం చేసి, జరుగుతున్న జాప్యం పట్ల నాలో ఆగ్రహం పేట్రేగి, పొద్దు గుంకుతున్నకొద్దీ పొడవయ్యే నీడల్లా ఆమె ఒద్దికైన జీవితం కుంచించుకుపోయేకొద్దీ దీర్ఘమవుతున్న దుర్భర క్షణాలు, గుట్టలుగా పేరుకుంటున్న ఘడియలు, విఘడియల మీద శత్రువులా విద్వేషం కక్కేంత వరకూ కూడా ఆమె దుర్బల ఆత్మ తన ఇసుక గూళ్ళనే అంటిపెట్టుకొని ఉండిపోయింది, ఎన్నో రోజులు, వారాలు, ఎంతకూ తెగని, తెమలని నెలల పర్యంతం.

ఓ శిశిర సాయంకాలం పూట, తెమ్మెరలు ఇంకా స్వర్గంలోనే నిశ్చలించి ఉన్నప్పుడు, తాను అంటుకుపోయిన పడక దగ్గరకి పిలిచింది నన్ను. మసక మంచుతెరలు భూ ఉపరితలం మీద జీరాడుతున్నాయి, నీటి మీద ఏదో నులి వెచ్చని వెలుతురు. దట్టమైన అడవిలో రాలడానికి సిద్ధంగా ఉన్న గుబురు ఆకుల్లోంచి మెరుస్తున్న ఇంద్రచాపం, ఏవో అమర లోకాల్లోంచి జారిపడినట్లు.

నేను మొరెల్లకి దగ్గరగా కూర్చున్నాను.

"బ్రతకడానికి, లేదా చావడానికైనా ఉద్దేశించిన అనేకానేక రోజుల్లో ఈ రోజు కూడా ఒకటి. ధరణీ పుత్రులకి నిండు జీవితం కాన్క అయ్యే సుదినమిది. ఫ్చ్! అమర లోకపు ఆడ పడుచులకి మృత్యువు సంప్రాప్తించే దుర్దినం కూడా ఇదే!"

---

*నువ్వు నా పట్ల, ఈ మొరెల్ల మీద చూపిన నిశ్చలానురాగం ఒక చిట్టి అంకురమై నాలో పెరుగుతుంది. ఎప్పుడు హంస నాలోంచి ఎగిరిపోతుందో అప్పుడే మనిద్దరి, నీ- మొరెల్లాల ప్రేమఫలమైన ఆ చిన్నారి ఊపిరి పోసుకుంటుంది. కానీ, ఇక నీకు గడిచేవన్నీ దిగులు దినాలే, వృక్షాల్లో చిరకాలం నిలిచే సైప్రస్ వృక్షంలా దీర్ఘకాలం చెరిగిపోని గుర్తులతో నిండిన దిగులు!*

---

నేనామె నుదుటిని ముద్దాడాను, ఆమె కొనసాగించింది.

"నేను చనిపోతున్నాను, అయినా బతికే ఉంటాను..."

"మొరెల్లా..."

"నన్ను నువ్వు గాఢంగా ప్రేమించిన నాటి రోజులు మళ్ళీ రావు. అయితే ఒక్క విషయం- బ్రతుకంతా తీవ్రంగా అసహ్యించుకోబడ్డ మనిషైనా, చావు ముంగిట్లో మాత్రం ఆమె పట్ల అభిమానం, ఆరాధన కలిగి తీరుతాయి".

"మొరెల్లా"

"మళ్ళీ చెబుతున్నాను, నేను చనిపోబోతున్నాను. నువ్వు నా పట్ల, ఈ మొరెల్ల మీద చూపిన నిశ్చలానురాగం ఒక చిట్టి అంకురమై నాలో పెరుగుతుంది. ఎప్పుడు హంస నాలోంచి ఎగిరిపోతుందో అప్పుడే మనిద్దరి, నీ- మొరెల్లాల ప్రేమఫలమైన ఆ చిన్నారి ఊపిరి పోసుకుంటుంది. కానీ, ఇక నీకు గడిచేవన్నీ దిగులు దినాలే, వృక్షాల్లో చిరకాలం నిలిచే సైప్రస్ వృక్షంలా దీర్ఘకాలం చెరిగిపోని గుర్తులతో నిండిన దిగులు! ఆనంద ఘడియలు ఇక నీ జీవితంలో అంతమైపోయాయి. పెస్టమ్‌లో ఏడాదికి రెండు మార్లు పూచే గులాబీల్లా సంతోషమన్నది నీ జీవితంలో రెండుసార్లు ఉండబోదు. కాలంతో దాగుడుమూతలు ఇక మీదట ఆడలేవు. ప్రేమ పారిజాతాలకీ, ప్రణయ మధువుకి దూరమై, నిన్ను నువ్వే భరిస్తూ మక్కాలో ముస్లింలా ఈ భూమ్మీద ఓ మూల నక్కి బతుకీడుస్తావు".

"మొరెల్లా..." దుఃఖం ఎగదన్నుకొస్తుంది "మొరెల్ల! ఎలా తెలుసు ఇదంతా నీకు?"

ఆమె అటు ఒత్తిగిల్లి ముఖం దిండులో దాచేసుకుంది. తన కరచరణాలు స్వల్పంగా వణికి, ఆపై ఆగిపోయాయి. ఆమె మరణించింది, ఆ గొంతుక మరి ఇక నేను వినలేను.

అయినా, ఆమె ముందే చెప్పినట్టుగా, చనిపోబోయే ముందు ఒక శిశువుకి జన్మనిచ్చింది. తల్లి ఊపిరి ఆగిన తర్వాతే ఆ బిడ్డ తొలి శ్వాసం తీసింది. కానీ, కన్ను మూసిన కన్నతల్లి లక్షణాలు పుణికి పుచ్చుకొని, స్థాయీభేదాల్లో, తెలివితేటల్లో తల్లిని తలపిస్తూ ఎదిగింది ఎంతో విచిత్రంగా. ఈ గ్రహం మీద ఏ జీవికైనా ఎంత మేరకు ప్రేమించడం సాధ్యమో, అంతకంటే మించి నా బిడ్డని ప్రేమించాను.

కానీ, కాలం గడిచేకొద్దీ ఈ స్వచ్ఛ ఆత్మీయ అమరానందం కలకబారింది, నిస్తబ్ధమై, భీతావహమై దుఃఖమేఘాలు నిండా ముసురుకున్నాయి. తల్లిని పోలిన వివేకంతో, ఆమెలానే నా చిట్టితల్లి ఎదిగిన వైపరీత్యం గురించి చెప్పాను కదా! అవును నిజంగా వైపరీత్యమే. శారీరక ఎదుగుదల ఒక విచిత్రమైతే, నా కూతురు మానసికంగా పెద్దదయ్యేకొద్దీ తన సంక్షుభిత భావ స్రవంతి నన్ను ముంచెత్తి, మరింత భయపెట్టేది. అసలింతకీ ముక్కుపచ్చలారని నా చిట్టితల్లి ఆరిందలా ప్రవర్తించడాన్ని నేనెప్పుడు గమనించాను? ఆ నునులేత పసి పెదాలు అనుభవ పాఠాల్ని ఎప్పుడు వల్లెవేశాయి? రెప్పలల్లార్చే ఆ విశాల నేత్రాల్లోంచి గడసరి లాలస, వివేకం కొట్టొచ్చినట్టు నాకు అగుపించిందెప్పుడు? నా అంతరాత్మకి తెలియకుండా ఇక ఎంత మాత్రం దాచలేని, స్వీకారానికి జంకి జడిసే దృక్పథాల నుంచి విసిరేయలేని ఈ మార్పులన్నీ నా కుపిత ఇంద్రియాలను తాకిందెప్పుడసలు? సమాధిపాలైపోయిన నా మొరెల్ల చకిత సిద్ధాంతాలు, విహ్వాల గాథల తలపోతలో దుఃఖోపహతుడ్నైన నా ఆలోచన మీద, లేదా అంతఃకరణ మీద మొలిచి నక్కే సదరు సహజ భయోద్విగ్న సందేహాలు ఆశ్చర్యం పుట్టించేవి కావా? ఎవరి విధి నన్ను తనని ఆరాధించేలా ప్రేరేపించిందో, ఆ బంగారుకొండ- ఈ లోకం శల్యపరీక్షలకి గురికాకుండా, ఈ ప్రపంచం దిష్టి తనకి ఎంతమాత్రం తగలకుండా జాగ్రత్తలు చేశాను. అలా సమాజం నుంచి ఐచ్ఛికంగా వెలి అయ్యి మరీ నా ప్రియమైన చిన్నారిని సాకాను.

కల్లోలితాంతరంగంతో తననే గమనిస్తూ-

అలా ఏళ్ళు గడిచేకొద్దీ, తన విచిత్రమైన, స్వచ్ఛమైన, ప్రశాంతమైన వదనాన్ని నిత్యం తేరిపార చూస్తూనే ఉండేవాడిని. అలా తాను పరిపక్వమయ్యే క్రమంలో తనకి, మృత్యుపర్యంకాన సేదదీరిన దైన్య- మొరెల్లకు ఉన్న పోలికల్లో కొంగొత్త కోణాలు నాకు తేటతెల్లమవుతుండేవి. ఈ సారూప్యాల నీడలు ఘడియ ఘడియకీ చిక్కనై, సంపూర్ణమై, నిర్దిష్టమై, మరీ దిగ్భ్రాంతికరమయ్యి, ఇంకా ఇంకా విపరీతాలై నన్ను భయపెట్టేవి. తన నవ్వు అచ్చం అమ్మ చిర్నవ్వులా ఉన్నా, నేను భరించగలిగేవాడ్ని; కానీ, యథాతథమైన ఆ గాథ రూపసామ్యంలో నేను మునగదీసుకుపోయేవాడిని. తన కళ్ళు కూడా మొరెల్ల కళ్ళని పోలినప్పటికీ, సహించగలిగేవాడ్ని; కానీ, భయద, గాంభీర్యార్థాలు స్ఫురించే మొరెల్ల చూపుల్లానే నా చిన్నారి చూపులు కూడా నా అంతర్మాళిగల లోలోతుల్లోకి తరచూ దూసుకుపోతుండేవి. ఆ ఎత్తైన ఫాలభాగాన గజిబిజి గీతల్లో, మెత్తని పట్టు జుట్టులోంచి జీరాడే మెలికల ముంగురుల్లో, మట్టిపాలైపోయిన వడిలిన మునివేళ్ళలో, ఆమె పలుకుల విషాద సంగీతపు సవ్వడిలో, అన్నింటినీ మించి, అవును అన్నింటినీ మించి, ప్రియమైన వారసురాలి పెదాల మీంచి తుళ్ళే తల్లి భావ స్రవంతిలోనూ నేను కనిపెట్టాను-

ఎప్పటికీ చావన్నదే లేని కీటకం ఎడతెగని భావోత్పాతానికి కావాల్సిన మేతని. పదేళ్ళు నిండిపోయినా, నా కూతురు ఈ భూమ్మీద అప్పటికి ఇంకా అనామికంగానే ఉంది. నాన్న వాత్సల్యం తనకి 'చిన్నారి', "నా వరాల కొండ" అనే రెండు ముద్దు పేర్ల హోదాని కట్టబెట్టాయంతే. ఆమె వయసంతా కఠినమైన ఏకాకితనంలో గడవటం వల్ల తనకీ మరే యితర బంధాలూ ఏర్పడలేదు. మొరెల్ల పేరు- ఆమెతో, ఆమె మరణంతోనే సమసిపోయింది. తల్లి గురించి బిడ్డతో నేనెప్పుడూ మాట్లాడలేదు, అది అసంభవం కూడా. తల్లి జీవించిన కొద్దిపాటి కాలానికి సంబంధించిన చిహ్నాలేవీ చిన్నారి బాహ్యస్మృతిలో



లేనేలేవు. తన ఆంతరంగిక ఇరుకు హద్దుల వల్ల అరకొరగా కూడా ఏవీ భద్రపరచబడలేదు. కానీ, ఎంతో సందడిగా, అట్టహాసంగా బాప్టిజం ఇప్పించే సుదీర్ఘమైన వేడుక నా జీవితంలో ఎదురైన ఉపద్రవాలలో పెద్దదిగా తోచించి నా మనసుకి. ఆ ఉత్సవ కోలాహలంలో నామకరణం గురించి ఊగిసలాడాను. వివేకవంతమైన, వినసొంపైన పేర్లు, సనాతనమైనవి, ఆధునికమూ, దేశీ విదేశీ నామాలెన్నో నా పెదాల మీద తారాడాయి. హుందా అయిన పేర్లు, ప్రమోదాన్ని కలిగించేవి, మంచివి ఎన్నెన్నో...

కానీ, నా అమర ప్రేమికురాలి తలపు నన్ను కెలకడానికి దారి తీసిన పరిస్థితులేమిటి ఆ సమయంలో? ఏ జ్ఞాపకాల తలపోత నా క్రొన్నెత్తుటిని ఉప్పెన చేసి ఆపాదమస్తకం పరవళ్ళు తీయిస్తుందో, ఆ పునశ్చరణకి ఏ మహమ్మారి నన్ను పురిగొల్పింది? ఆ మసక దారుల్లో, ఆ నీరవ నిశ్శబ్దంలో నా అవనత ఆత్మల అగాధాల్లోంచి ఏ

**తల్లి గురించి బిడ్డతో నేనెప్పుడూ మాట్లాడలేదు, అది అసంభవం కూడా. తల్లి జీవించిన కొద్దిపాటి కాలానికి సంబంధించిన చిహ్నాలేవీ చిన్నారి బాహ్యస్మృతిలో లేనేలేవు. తన ఆంతరంగిక ఇరుకు హద్దుల వల్ల అరకొరగా కూడా ఏవీ భద్రపరచబడలేదు.**

రక్కసి పలికించింది నా నోట, పురోహితుని చెవిలో గుసగుసగా మొరెల్ల విస్మృత నామాన్ని? చిరు మోతలతో లీలగా మొదలై మహా శబ్దారోహణలో కణేల్‌మన్న మృత్యు గంటల్ని ఏ మహా రాకాసి మోగించింది? ఎవరు... నా చిన్నారి మురిపాల కవళికల్ని పట్టి కుదిపింది? ఆ గాజుకళ్ళ బేల చూపుల్ని నేల మీంచి నింగికి మళ్ళించింది? నల్లని చలువరాతి సమాధుల్లోకి తలక్రిందులుగా జారిపడుతూ నా బంగారు తల్లి ఆక్రోశించిందిలా: "నేనిక్కడున్నాను".

స్ఫుటంగా, దయనీయంగా, నిశ్శబ్ద స్పష్టతతో ఆ పలుకుల సడి నా చెవుల్లోకి జారింది, కరిగించిన సీసం బుసబుసలతో మెదడులోకి పారినట్టు. ఏళ్ళకు ఏళ్ళు గడిచిపోయినా, ఆ స్మృతిశకలం మాత్రం సజీవం. పారిజాతాల్ని, మధురసాల్ని మర్చిపోయినా, దివారాత్రాలు నన్ను నిండా కమ్మేసే సైప్రస్, హెమ్లాక్ చెట్ల నుంచి నేను ఏమారలేదు. సీమాసమయాల స్పృహ లేదు, నా జాతక నక్షత్రాలన్నీ ఆకాశంలో కనుమరుగైపోయి, నా ప్రదేశమంతా మరింత చీకట్లు ముసిరాయి. నన్ను దాటుకుంటూ కదిలిపోతున్న ఎన్నో జ్ఞాపకాల నీడల్లో నేను పొదివి పట్టుకున్నది ఒక్కటే- మొరెల్ల. వినువీధుల్లోంచి వీచే గాలులు నా చెవులకు విన్పించే ఊసు ఒక్కటే, కల్లోలిత కడలి ఉపరితల తరంగధైర్యం చేరవేసే గుసగుస కూడా ఒక్కటే- మొరెల్ల. కానీ ఆమె మరణించింది; నా స్వహస్తాలతోనే ఖననం చేశాను; చిన్నారి మొరెల్లని కప్పెట్టిన చోట మొదటి మొరెల్ల జాడలేవీ కన్పించకపోవడంతో నా జాలి పెదాలపై విరిసిందొక తెంపులేని వగరు నవ్వు-